శ్రీయుత సెక్రటరీ గారు,
తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి,
నియంత్రన్ భవన్, జీటీయస్ కాలనీ, కళ్యాణ్ నగర్
హైద్రాబాద్.

సార్!

విషయం: OP నం. 14 మరియు 15 ఆఫ్ 2026 ` ఉత్తర / దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్ TGNPDCL/TGSPDCL లైసెన్స్ సవరణకు సంబంధించిన పిటిషన్ల విషయమై అభిప్రాయాలు / సూచనలు / అభ్యంతరాలు సమర్పించుట.

రెఫరెన్స్: 1) జీఓ నెం. 44 తేదీ 17-12-2025
2) జీఓ నెం. 4 తేది 11.3.2026

కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన మూడో డిస్కం లేదా తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌కు లైసెన్స్ మంజూరీ విషయమై 29.5.2026 నాడు గౌరవ కమీషన్ వారు బహిరంగ విచారణ చేపట్టడం జరిగింది. అంతకు మునుపు వ్రాతపూర్వకంగా భారీ సంఖ్యలో అభ్యంతరాలు / సూచనలు / అభిప్రాయాలు వివిధ రంగాలు మరియు వ్యక్తులు సమర్పించడం జరిగినది.

మూడో డిస్కం లైసెన్స్ మంజూరీ విషయమై నిర్ణయం గౌరవ కమిషన్ ఇంకా వెలువరించ వలసి ఉన్నది.

ఈ లోగా ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలు తమ పరిధిలోయున్న వ్యవసాయ కనెక్షన్లు, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగరీథ, మున్సిపల్ మంచినీటి పథకాలు మరియు హైద్రాబాద్ వాటర్ సప్లై మరియు సీవరేజ్ బోర్డు కనెక్షన్లు మూడో డిస్కంకు (TGRPDCL) బదలాయించడానికి అనుమతిని కోరుతూ కమీషన్ వద్ద దరఖాస్తు చేసుకున్నారు. మున్ముందు మూడో డిస్కం లైసెన్సను జారీ చేయదలచిన పక్షంలో గౌరవ కమీషన్ వారు క్రింద పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి.

1) వివిధ వర్గాలు, ఉద్యోగ సంఘాలు వెలువరించిన అభిప్రాయాలను, అభ్యంతరాలను పరిష్కరించవల్సిందిగా విజ్ఞప్తి.అందులో అనేక న్యాయపరమైన , సాంకేతిక, ఆర్థిక, ఉద్యోగులకు సంబందించిన అనేక విషయాలు ఇమిడి ఉన్నది తమరికి విదితమే.

క్షేత్రస్థాయిలో అవసరమైన సిబ్బంది నియామకం, మూడో డిస్కంను సమర్థవంతంగా నడిపించడానికి కావల్సిన నిధులను సమకూర్చడం ప్రధానాంశాలు. 12వేల పై చిలుకు విలేజ్ కరెంటు అధికారులను నియమించనున్నట్లు పత్రికల్లో చదివాము. దీనిని ఆహ్వానించదగిన పరిణామంగా భావిస్తున్నాము. అదే సమయంలో మూడో డిస్కంకు ఎలాంటి అప్పులు బదలాయించకుండా కనీసం పదివేల కోట్ల రూపాయల మూలధనం ప్రభుత్వం కేటాయించాలి.

2) మూడో డిస్కం పరిధిలో వ్యవసాయ కనెక్షన్లు మాత్రమే కాకుండా వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు సంబంధించిన కనెక్షన్లు కూడా చేర్చాలి. డైరీ ఫాంలు, పౌల్ట్రీఫాంలు, గ్రామీణ ప్రాంతాల్లోని రైస్ మిల్లులు, చెరుకు/ బెల్లం క్రషర్లు తదితర వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు కూడా ఎక్కువగా వ్యవసాయ ఫీడర్లపైనే ఉంటాయి. కాబట్టి వీటిని రైతు డిస్కం పరిధిలోకి చేర్చాలి.

3) మూడో డిస్కం లైసెన్స్ గ్రాంట్ చేసినట్లయితే ఒకే ప్రాంతంలో బహుళ లైసెన్సులు (Multiple licensees) ఉన్న పరిస్థితుల్లో వినియోగదారునికి కంపెనీని ఎంచుకునే హక్కు ఉండడం న్యాయసమ్మతం కాదా? ఈ విషయాన్ని కమీషన్ వారు పరిశీలించాలి. మూడో డిస్కం రైతులకు మరింత మెరుగైన , నాణ్యమైన సేవలు అందిస్తామని ముందుకొచ్చినారు.

ప్రస్తుతం వ్యవసాయరంగానికి ఇరవై నాలుగు గంటలు కాకపోయినా సంతృప్తికరమైన విద్యుత్తు సరఫరా జరుగుతున్నది. ఎక్కడా లో ఓల్టేజీ సమస్య, పంటలు ఎండిపోవడం లాంటి సమస్యలు లేవు. భవిష్యత్తులో మూడో డిస్కంలో ఇటువంటి పరిస్థితులే కొనసాగుతాయన్న గ్యారెంటీ ఉండాలి. లేని పక్షంలో రైతులు దక్షిణ / ఉత్తర డిస్ట్రిబ్యూషన్ కంపెనీల ఆధీనంలోకి తిరిగి రావడానికి కావల్సిన ఆప్షన్ సౌకర్యం కల్పించాలి.

4) గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం 48 గంటల్లో ఫేయిల్ అయిన ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి తగిన ఆదేశాలు ఇచ్చియున్నారు. భవిష్యత్తులో కూడా ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి కావల్సిన ప్రత్యేక వ్యవస్థను మూడో డిస్కంలో ఏర్పాటు చేయాలి.

వ్రాతపూర్వకమైన అభ్యంతరాలలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యుత్తు రంగ నిపుణులు, ఉద్యోగ సంఘాలు వెలిబుచ్చిన అభ్యంతరాలన్నింటినీ తగురీతిలో పరిష్కరించేలా తగు ఆదేశాలను జారీ చేసిన తదనంతరమే OP నం. 14 మరియు 15 పిటిషన్లను పరిగణనలోకి తీసుకోవాలని గౌరవ కమీషన్‌ను ప్రార్థిస్తున్నాను.

భవదీయుడు

తుల్జారాంసింగ్ ఠాకూర్
రిటైర్డ్ ఇంజనీర్,
4-9-93,
హిమగిరినగర్ కాలనీ,
బండ్లగూడ జాగీర్,
హైదరాబాద్-500 091